# నీటి ఎద్దడి నివారణకు కృషి చేయాలి

- అడిషనల్ డీఆర్‌డీఏ, మండల ప్రత్యేక అధికారి సూర్యారావు

ఆమనగల్లు, ఏప్రిల్ 18 : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఆర్‌డీఏ, మండల ప్రత్యేక అధికారి సూర్యారావు, మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీకాంత్ అధ్యక్షతన తాగునీటి సరఫరా నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామాల్లో నీటి సమస్యను అడిగి తెలుసుకోవాలని, పైపు లైన్లు, తాగునీటి బోర్ల మరమ్మతులు చేపట్టాలని అన్నారు. సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాల్లో రైతుల వద్ద బోరుబావులను లీజుకు తీసుకుని తాగునీటిని సరఫరా చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ లలిత, ఎంపీవో శ్రీలత, మిషన్ భగీరథ డీఈ సందీప్, ఏఈ శరత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మంచాల : ప్రత్యేకాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలశంకర్

మంచాల : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడ నీటి సమస్య తలెత్తినా వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకంలో పని కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి కూలీకి పని కల్పించాలని కోరారు. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావు, మండల ప్రత్యేకాధికారి శాంతిశ్రీ, వివిధ గ్రామాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఈదమ్మ కల్యాణోత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈదమ్మ దేవత మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున ఈదమ్మతల్లి, మానుదాస్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఈదమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు నర్సింహ, భాస్కర్‌రెడ్డి, చందోజీ, వెంకటేశ్, జహంగీర్ అలీ, యాదగిరిరెడ్డి, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

## కనుల పండువగా కల్యాణం



కల్యాణానికి హాజరైన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 18 : మండలంలోని కవాడిపల్లి గ్రామంలో మూడు రోజులుగా శ్రీ కోదండ రామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి మంగళవాయిద్యాలతో కోదండ రామచంద్రస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రంగాపూర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మంచాల, ఏప్రిల్ 18 : మంచాల మండలం రంగాపూర్ జడ్పీహెచ్‌ఎస్ 1998-99 సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం సాయంత్రం ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. కేక్ కట్‌చేసి ఆడుతూ పాడుతూ సందడి చేశారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు నర్సింహారావు, రెడ్యానాయక్, సురేందర్‌రెడ్డి, ప్రేమాకర్‌రెడ్డి, సత్యనారాయణలను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గంగాపురం యాదయ్య, లింగం యాదవ్, జగన్, రాజు, రాజేశ్, మహిపాల్, శ్రీహరి, కిషన్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ స్టేషన్ అధికారి

చేవెళ్లటౌన్, ఏప్రిల్, 18 : అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చేవెళ్ల ఫైర్‌స్టేషన్ ఎస్‌ఎఫ్‌వో భిక్షపతి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంట్లోని పిల్లలను గ్యాస్ స్టౌవ్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. నివాసాలలో విద్యుత్ పరికరాలకు నిప్పంటుకుంటే దానిని నీటితో ఆర్పవద్దని, వెంటనే కరెంటు ఆఫ్ చేయాలన్నారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే 101కి ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది దుర్గాదాస్, ఖాజా, సురేందర్, గోపాల్, శివ తదితరులు పాల్గొన్నారు.

## జింక మృత్యువాత



కొత్తూరు, డిసెంబర్ 18: కుక్కల దాడిలో ఓ జింక మృతి చెందింది. ఈ సంఘటన కొత్తూరు మండలం మక్తగూడలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. కొత్తూరు మండలంలోని మక్తగూడ శివారులోకి గురువారం ఉదయం ఓ జింక వచ్చింది. కొన్ని కుక్కలు ఆ జింకను వెంబడించడంతో మక్తగూడ గ్రామంలోకి వచ్చింది. గ్రామస్తులు ఆ జింకను తాడుతో కట్టివేశారు. అయితే కొద్ది సేపటికే ఆ జింక మృతి చెందింది. మృతదేహాన్ని శంషాబాద్ పంచవటి పార్కులో పాతిపెట్టామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సంతోష్ తెలిపారు. జింకకు ధైర్యం అంతగా ఉండదని, కట్టి వేయకుండా గదిలో వేస్తే బతకడానికి అవకాశముండేదని అధికారి తెలిపారు.

## ద్రోహులకు ప్రజలు బుద్ధి చెప్పాలి

ఆమనగల్లు, ఏప్రిల్ 18 : బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్, బీజేపీ పార్టీలోకి వెళ్లిన నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని జడ్పీటీసీ నేనావత్ అనురాధ, కడ్తాల్ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. ఆమనగల్లు మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నో మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలు తాగు, సాగు నీరు అందక ఇబ్బందులు పడుతుంటే, సమస్యలను పరిష్కరించకుండా ప్రతిపక్ష పార్టీలపై బురదజల్లే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు ఎంపీగా పోటీ చేసే అభ్యర్థులు లేక బీఆర్‌ఎస్ నాయకులను బెదిరించి, మభ్యబెట్టి వారి పార్టీలో చేర్చుకుని ఎంపీగా పోటీ చేయిస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ పార్టీలో అనేక పదవులు అనుభవించి, కేవలం వారి స్వార్థం కోసం పార్టీలు మారుతున్న నాయకులకు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో కడ్తాల్ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, వెల్దండ మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, నాయకులు శ్రీను, రమేశ్ నాయక్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీలు నేనావత్ అనురాధ, జర్పుల దశరథ్ నాయక్

## హెల్ప్‌లైన్‌ను సద్వినియోగం చేసకోవాలి

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 18: వేసకవి కాలం దృష్ట్యా ప్రజలందరూ నీటిని వృథా చేయరాదని, నివాసాల ఎదుట కార్లు, బైకులు కడగడంతో పాటు రోడ్లపై నీళ్లను వృథాగా వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండలతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. మున్సిపాలిటీలో నీళ్ల ఇబ్బంది లేకుండా మున్సిపాలిటీలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హెల్ప్‌లైన్‌కు సంబంధించిన మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న 8790902474, మున్సిపల్ ఇంజినీర్ రాయుడు 6300495394, వాటర్ సప్లయ్ ఇన్‌చార్జి ఖాజా ఇలియాస్ మొయినొద్దీన్ 7780770958, లైన్‌మన్ బాబా శర్ఫోద్దీన్ 8977222075 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## సర్కారు నిర్లక్ష్యంతోనే విద్యార్థి మరణం

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 18: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై మృతిచెందిన విద్యార్థి ప్రశాంత్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గ్యార మల్లేశ్ డిమాండ్ చేశారు. మృతిచెందిన విద్యార్థి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, ప్రభుత్వాధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి కారణమన్నారు. చనిపోయిన కుటుంబాలను ఆదుకోవాలని, లేకుంటే బీఎస్పీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

## బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్‌గా రవీందర్‌రెడ్డి



రవీందర్‌రెడ్డి

యాచారం, ఏప్రిల్18: బీజేవైఎం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్‌గా మండలంలోని నజ్దిక్‌సింగారం గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డిని నియమిస్తూ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీశ్ గురువారం ఉత్తర్వులను అందజేశారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నట్లు పేర్కొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

షాద్‌నగర్, ఏప్రిల్18 : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సభ్యులు గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన నివాసంలో వినతి పత్రాన్ని అందజేసి పలు సమస్యలను ప్రస్తావించారు. అర్హత కలిగిన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. అదేవిధంగా అన్ని ప్రైవేట్ దవాఖానల్లో జర్నలిస్టుల హెల్త్ కార్డులు పనిచేసేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, నర్సింహారెడ్డి, నరేశ్, మల్లేశ్, స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు.

## నీటిని వృథా చేస్తే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీ

కొత్తూరు, ఏప్రిల్18: తాగునీటిని వృథా చేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బాలాజీ అన్నారు. వేసవి కాలంలో తాగునీటి కొరతపై మున్సిపల్ అధికారులతో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా తాగునీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. వృథా చేస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో మున్సిపల్ ఇంజినీర్ ప్రేతేయాక్ష భీమారాయుడు, వాటర్ సప్లై ఇన్‌చార్జి శ్రీకాంత్, లైన్‌మన్ ప్రవీణ్ సిబ్బంది పాల్గొన్నారు.

## హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలి



హనుమాన్ జయంతి శోభాయాత్రను జయప్రదం చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. గురువారం శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 23న సాయంత్రం 4గంటలకు పెద్ద ఎత్తున శోభాయాత్ర చేపడుతున్నామన్నారు. వనస్థలిపురం గురుద్వార్ రోడ్‌లోని రామాలయం వద్ద యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు.

-వనస్థలిపురం, ఏప్రిల్ 18 :

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

తుర్కయాంజాల్, ఏప్రిల్ 18 : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పని సరిగా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం సెయింట్ పాల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు హక్కు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ పోలింగ్ రోజున తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్మయి, మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఈఈ హరీశ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది

## పంటలు ఎండుతున్నా పట్టించుకోని ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

కందుకూరు. ఏప్రిల్ 18 : పంటలు ఎండుతున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎంపీటీసీలు ప్రశ్నించారు. గురువారం మండల పరిషత్ సమావేశపు హాలులో ఎంపీపీ మంద జ్యోతి పాండు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, తాండ్ర ఇందిరమ్మ దేవేందర్, కాకి రాములు మాట్లాడారు. భూగర్భజలాలు అడుగంటి పోవడంతో బోర్లలో నీటి మట్టం తగ్గి పంటలు ఎండుతున్నాయని దీంతో స్టాటర్లు కాలి పోతున్నాయని అన్నారు. వ్యవసాయానికి 18గంటలు. గృహ అవసరాలకు 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రమేశ్‌గౌడ్ తెలిపారు. వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా పర్యటించి పంట నష్టం వివరాలను సేకరించి నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓ సరిత పేర్కొన్నారు. ప్రసవం సమయంలో కేసీఆర్ కిట్లు ఇస్తున్నారా.. అమ్మాయి పుడితే రూ. 13వేలు, అబ్బాయి జన్మిస్తే రూ.12వేలు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. పంచాయతీ సిబ్బందికి వేతనాలను ఇవ్వాలని జాప్యం చేయకూడదని ఎంపీడీఓ సరిత తెలిపారు. తాగునీటి పై జరిగిన చర్చలో సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, ఇందిరమ్మ దేవేందర్, రాములు, యాదయ్య, ఎల్లారెడ్డి, పద్మ పాడు, సురేశ్, మల్లేశ్ మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, పలు గ్రామాల్లో ప్రజలు ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుంటున్నారని తెలిపారు. తాగునీటి పై ఆందోళన వద్దని మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నట్లు డీఈఈ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. రెండు నెలల పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సరిత ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఉన్నందును ఎలాంటి తీర్మానాలు లేకుండా సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలపై అవగాహన తప్పనిసరి

కొండాపూర్, ఏప్రిల్ 18 : గచ్చిబౌలిలోని డీఎల్‌ఎఫ్ భవనంలో గురువారం మాదాపూర్ అగ్నిమాపక అధికారులు ఫైర్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక శాఖ డైరెక్టర్ డీజీ నాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రమాద సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిప్రమాదాలపై హైదరాబాద్ బిల్డర్స్, ఫైర్ సేఫ్టీ ఆఫీసర్లతో అవగాహన సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాదాపూర్ ఫైర్ స్టేషన్ అధికారులు,సిబ్బంది, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



బిల్డర్లు, అధికారుల అవగాహన సమావేశంలో డీజీ నాగిరెడ్డి తదితరులు

## గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



విజేతలకు షీల్డ్ అందజేస్తున్న ఎమ్మె సత్యనారాయణ

కొత్తూరు, ఏప్రిల్ 18: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ అన్నారు. కొత్తూరు మండలంలోని ఎస్‌బీపల్లిలో శ్రీకాంత్ జ్ఞాపకార్థం ఎమ్మె సత్యనారాయణ పల్గుడెం ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. విజేతలకు ఎమ్మె సత్యనారాయణ గురువారం బహుమతులను అందజేశారు. గెలుపొందిన టీమ్‌కు రూ. 15 వేలు నగదు, షీల్డ్, రన్నరప్‌కు రూ. 10 వేలు, షీల్డ్, మూడు, నాలుగో స్థానంలో ఉన్న టీమ్‌లకు రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్, నాయకులు శ్రీశైలం, ఎమ్మె అజ్జయ్, ఎమ్మె నర్సింహ, కృష్ణయ్య, కుమ్మరిగూడెం పాండు పాల్గొన్నారు.

## అంబలి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మేడిపల్లిలో అంబలి తాగుతున్న గ్రామస్తులు

యాచారం, ఏప్రిల్ 18 : మేడిపల్లి గ్రామంలో ఏవీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, అంబలి కేంద్రాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్ ఆడాల గణేశ్ అన్నారు. గ్రామంలో గురువారం అంబలిని ఆయన ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండు వేసవిలో చుక్కనీటి కోసం ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని ప్రధాన కాలనీల్లో రోజుకొక చోట అంబలి పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు.

## రేప్ కేసులో బాలుడికి జైలు శిక్ష, జరిమానా

ఆమనగల్లు, ఏప్రిల్ 18 : ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రేప్ కేసులో బాలుడి(17)కి రంగారెడ్డి జిల్లా జువైనల్ కోర్టు జడ్జి ఏడాది జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ బలరాం తెలిపారు. 2018లో జరిగిన సంఘటనలో కేసు విచారణలో భాగంగా.. నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఆయన వివరించారు. ఈ కేసుపై సకాలంలో స్పందించిన సీఐ వెంకటేశ్వర్లును, సాక్షులను.. త్వరితగతిన కోర్టులో హాజరుపరిచిన ఎస్‌ఐ బలరాంను, కోర్టు కానిస్టేబుల్ శివశంకర్‌ను షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి అభినందించారు.